క్లుప్తంగా

విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్ 11కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏడీఈ విజయ్ భాస్కర్ ప్రకటించారు. బౌద్ధనగర్ ఫీడర్ పరిధి అంబర్‌నగర్, లలితానగర్, వారాసిగూడ, కౌసర్‌మజీద్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి 11.30 వరకు, జామై ఉస్మానియా ఫీడర్ పరిధిలో జమిస్తాన్‌పూర్, ఎస్‌బీహెచ్‌కాలనీ, అంబర్‌నగర్ తదితర ప్రాంతాల్లో 11.30 నుంచి 1.30 వరకు, బాలాజీనగర్ ఫీడర్ పరిధిలో రాంనగర్‌గుండు అంబర్‌నగర్, అడిక్‌మెట్ ఫీడర్‌పరిధిలో విద్యానగర్ తదితర ప్రాంతాలలో 2.30 నుంచి 5గంటల వరకు, ఎల్ఎన్‌నగర్ ఫీడర్ పరిధిలో వారాసిగూడ, అశోక్‌నగర్ నాలా, పుల్లయ్య బావి తదితర ప్రాంతాల్లో 3 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

అయ్యప్ప మహాపడిపూజ



కాచిగూడ: శ్రీ జవంతీశ్వర అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 8 న కాచిగూడలోని తుల్జాభవన్‌లో అయ్యప్ప స్వాముల ఇరుముడి, మహాపడిపూజ ఉంటుందని సంఘం చైర్మన్ డి.రంగారావు గురుస్వామి, అధ్యక్షుడు బోసు గురుస్వామి, ప్రధానకార్యదర్శి విష్ణు గురుస్వామి తెలిపారు. శుక్రవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.

శ్రీ సరస్వతీ సంగీత విద్యాలయ వార్షికోత్సవం

నల్లకుంట: శ్రీ సరస్వతి సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 11న శ్రీ త్యాగరాజ స్వామి 176 వ ఆరాధన ఉత్సవాలు, సంగీత విద్యాలయం 67వ వార్షికోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్ శ్రీనివాసశర్మ ప్రకటించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. బాగ్ అంబర్‌పేట్‌లోని షిరిడీ సాయిబాబా ఆలయంలో బుధవారం సాయంత్రం 5.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. సంగీత విద్యాలయం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విద్యార్థులంతా సమయానికి ఈ కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. సంగీత విద్యాలయం అధ్యాపకులు తేజస్విని, యశస్విని పాల్గొన్నారు.

జన్మదిన వేడుకలు

కాచిగూడ: బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు జన్మదిన వేడుకలు బర్కత్‌పురాలోని పార్టీ నగర కార్యాలయంలో ఘనంగా జరిగాయి. శుక్రవారం పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రాంచంద్రారెడ్డి, కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్, పార్టీ నేతలు నందకిషోర్‌యాదవ్, సూర్యప్రకాష్‌సింగ్, శ్రీధర్, కిషోర్‌కుమార్, యువమోర్చా అధ్యక్షుడు సందీప్‌యాదవ్, ప్రవీణ్, బండారిసంతోష్‌కుమార్, సుభాష్‌పటేల్, భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అభినందన

అంబర్‌పేట: అంతర్జాతీయ స్థాయి మ్యాథ్స్ ఒలంపియాడ్ పోటీ పరీక్షల్లో రాష్ట్ర స్థాయి రెండో ర్యాంకు సాధించిన విద్యార్థిని పాఠశాల జీఎం అభినందించారు. డీడీకాలనీ నారాయణ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని చక్రికను పాఠశాల జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం బాలపరమేశ్వర్‌రావులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. నాల్గోతరగతి చదువుతున్న చంద్రరిషిత 11వ ర్యాంక్ సాధించడంతో శుభాకాంక్షలు తెలిపారు. ప్రిన్సిపాల్ మౌనిస్టాలిన్, ఏఓ మల్లికార్జున్‌రెడ్డి, ఏడీ చంద్రకళ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాకాంబరిగా శారదామాత



నల్లకుంట: పుష్య పౌర్ణమి సందర్భంగా నల్లకుంట శంకరమఠం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం శక్తి గణపతికి తొలి పూజలు నిర్వహించి చంద్రమౌళేశ్వర స్వామికి విశేష పూజలు నిర్వహించారు. మఠం అర్చకులు వివిధ రకాల కూరగాయల మాలలతో శారదామాతను శాకాంబరిగా అలంకరించి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మఠం ప్రాంగణంలో యాగశాలలో పండితుల మంత్రోచ్ఛరణల మధ్య చండీహోమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

అక్రమ పార్కింగ్‌ను అరికట్టాలి

కవాడిగూడ: భోలక్‌పూర్ డివిజన్‌లోని పీఅండ్‌టీ కాలనీలో ఇళ్ల ఎదుటే వాహనాలను అక్రమంగా పార్కింగ్ చేస్తున్నారని వాహనదారులను ప్రశ్నిస్తే ఇష్టానుసారంగా మాట్లాడుతూ దాడులకు పాల్పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణ, లతలు మాట్లాడుతూ.. గత కొద్ది రోజులుగా తమ కాలనీలో అక్రమంగా ద్విచక్ర వాహనాలు, కార్లు తదితర వాహనాలకు తమ ఇళ్ల ఎదుటే పార్క్ చేస్తున్నారని వాపోయారు. దీనిపై జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసు అధికారులకు పలుసార్లు ఫిర్యాదు చేశామని తెలిపారు.

- భారీ కేడ్లను ఏర్పాటు చేసి కాలనీలో అక్రమపార్కింగ్‌కు అడ్డుకట్ట వేయాలని సంబంధిత అధికారులను కోరారు. అసోసియేషన్ సహాయ కార్యదర్శి సంతోష్, కోశాధికారి, వినోద్, బస్తీ వాసులున్నారు.



అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకుంటాం

భోలక్‌పూర్‌లోని పీఅండ్‌టీ కాలనీలో ఇళ్ల ఎదుట పార్కింగ్‌పై చర్యలు తీసుకుంటాం. అక్రమ పార్కింగ్ చేస్తున్న వాహనదారులకు జరిమానాలు కూడా విధించాం. కాలనీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలి.

– చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నామానాయక్

కార్యకర్తలకు అండగా ఉంటాం



పరామర్శిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ తదితరులు

ముషీరాబాద్: బీజేపీ కార్యకర్తలు, నాయకులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆపదలో ఉన్న పార్టీ నాయకులను అన్ని విధాలుగా ఆదుకుంటామని పేర్కొన్నారు. ముషీరాబాద్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నర్సింగ్‌రావుగౌడ్ ఇటీవల మృతి చెందడంతో శుక్రవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఆయన సతీమణి మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు వరలక్ష్మి, బీజేవైఎం నగర కార్యదర్శి కుషాల్‌గౌడ్‌లను పరామర్శించారు.

- వైఎస్ఆర్ పార్కు ప్రాంతానికి చెందిన బీజేపీ రాష్ట్ర నాయకుడు జీఎస్ చారి తల్లి మృతి చెందడంతో వారి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.
- అనారోగ్యంతో బాధపడుతూ శస్త్ర చికిత్స చేయించుకుని బీజేపీ సీనియర్ నాయకుడు శ్రీధర్‌గౌడ్ ఇంటికి వెళ్లి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.
- బాపూజీనగర్‌కు చెందిన బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు ఎస్ శ్రీనివాస్ తల్లి మృతి చెందిన విషయం తెలుసుకుని వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను కలిశారు.
- బీజేపీ సీనియర్ నాయకుడు కిష్టయ్య మృతి చెందడంతో వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పలకరించారు. వారి ఆర్థిక పరిస్థితులు కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. తమవంతు సహకారం అందిస్తామని కుటుంబసభ్యులకు హామీ ఇచ్చారు. ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జమల్‌పూరి నందు, బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్, నవీన్‌గౌడ్, నాయకులు సురేష్, అనిల్, బద్రినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు



యంత్రాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సహకారంతో బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు చొరవ తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పాఠశాలలో టాయిలెట్లను శుభ్రపరిచే ప్రత్యేక యంత్రాన్ని కార్పొరేటర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛభారత్ స్ఫూర్తి ఉండేలా తమవంతు సహకారం అందిస్తామన్నారు. ఉపాధ్యాయులు సైతం పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా దృష్టి సారించాలని సూచించారు. బీజేపీ నాయకులు వెంకట్‌రెడ్డి, జగన్, బాల్‌రాజ్, రమేష్, మిరియాల శ్రీనివాస్ తదితరులున్నారు.

మున్సిపల్ సిబ్బందికి రూ. 25వేల వేతనం చెల్లించాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: మున్సిపల్ స్వీపర్లు, కామాటీలకు కనీస వేతనం రూ.25వేలు చెల్లించాలని ప్రొఫెసర్ గాలివినోద్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ మున్సిపల్ స్వీపర్లు కామాటీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ.. 90 శాతంపైగా ఎస్సీ, ఎస్టీ తదితర పేదవర్గాల వారే పనిచేస్తున్నారని ప్రభుత్వం వీరికి ఇస్తున్న జీతాలు కనీస అవసరాలకు కూడా సరిపోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

- మున్సిపల్ కార్మికులకు లేబర్ చట్టాన్ని వర్తింపచేసి కార్మికులు తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకుని జీవించాలని సూచించారు. సొసైటీ చైర్మన్ కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఇందిరా, జనరల్ సెక్రటరీ మల్లేషం, జాయింట్ సెక్రటరీ రేణుక, కోశాధికారి లక్ష్మి, శ్రావణి, రుక్మిని తదితరులున్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ గాలివినోద్‌కుమార్

తల్లీకూతుళ్ల అదృశ్యం

అడ్డగుట్ట: ఇంటి నుంచి బయటకు వెళ్లిన తల్లి, ముగ్గురు కూతుళ్లు అదృశ్యమయ్యారు. ఈ ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ రవీందర్ తెలిపిన మేరకు.. లాలాపేటలోని యాదవ బస్తీకి చెందిన స్వామి, నాగమణి(36) దంపతులు. వీరికి శ్రీనిధి (13), శ్రీనిజ(13), వినీల(11) ముగ్గురు కూతుళ్లు. ఈ నెల 15న ఇంట్లో భార్య భర్తల మధ్య గొడవ జరిగింది. కాగా, మరుసటి రోజు ఇంట్లో ఎవరూలేని సమయంలో తన ముగ్గురు కూతుళ్లను తీసుకొని నాగమణి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. ఈ నెల 21న నాగమణి సోదరుడు మధు ప్రకాష్ లాలాపేటకు వచ్చాడు. ఇంట్లో తన సోదరి నాగమణి ముగ్గురు పిల్లలు కనిపించకపోవడంతో తన బావ స్వామిని అడగగా, తనతో గొడవ పడి తన చెల్లెలు సోనీ ఇంటికి వెళ్లిందని చెప్పాడు. దీంతో ప్రకాష్ సోనీని కనుక్కోగా అక్కడికి నాగమణి రాలేదని చెప్పింది. తెలిసిన వారిని, బంధువులను వాకబు చేసినా ఫలితం కనిపించకపోవడంతో శుక్రవారం మధు ప్రకాష్ స్థానిక లాలాగూడ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



అదృశ్యమైన తల్లీకూతుళ్లు

ఓయూలో 1500 మంది పీహెచ్‌డీలు రద్దు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో 1500 మంది విద్యార్థుల పీహెచ్‌డీ అడ్మిషన్లను అధికారులు రద్దు చేశారు. శుక్రవారం ఓయూలో సమావేశమైన బాధిత విద్యార్థులు దశలవారీ ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించారు. యూజీసీ నిబంధనల ప్రకారం ప్రీ-పీహెచ్‌డీ ఉత్తీర్ణులైన విద్యార్థులు పరిశోధనలను ఎప్పుడైనా పూర్తి చేయవచ్చు. కానీ యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా ఓయూ వీసీ ప్రొ.రవీందర్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకొని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర పేద వర్గాలకు చెందిన 1500 పీహెచ్‌డీలను రద్దు చేసి జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ధ్వజమెత్తారు. వీసీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఈ నెల 10న సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు బాధితులు పేర్కొన్నారు.

కేంద్ర గ్రంథాలయంలో కవి సమ్మేళనం

చిక్కడపల్లి: అశోక్‌నగర్ నగర కేంద్ర గ్రంథాలయంలో ఈరోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కవి సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు కామన్‌డయాస్ సంస్థ అధ్యక్షుడు తంగెళ్లపల్లి కనకాచారి, తెలుగురాజ్యం కల్చరల్ ఫౌండేషన్ అధ్యక్షులు గోపరాజురవి ప్రకటించారు. సామాజిక అంశాలతో పాటు నూతన సంవత్సరంపై కవులు కవితలు వినిపించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 8790874028 నంబరును సంప్రదించాలని కోరారు.

డీఐజీ సుమతికి శుభాకాంక్షలు



డీఐజీ సుమతిని కలిసిన రుద్రవీణ మహిళ సంఘం సభ్యులు

అడ్డగుట్ట: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మహిళా భద్రత విభాగం డీఐజీ సుమతిని అడ్డగుట్టకు చెందిన రుద్రవీణ మహిళ సంఘం అధ్యక్షురాలు ఎస్. శోభ, ప్రధాన కార్యదర్శి గంధమాల జ్యోతిప్రభా రెడ్డిలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఐజీ సుమతికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈఎస్ఐసీ పారామెడికల్ నూతన కార్యవర్గం



అమీర్‌పేట : సనత్‌నగర్ ఈఎస్ఐసీ మెడికల్ కళాశాల బోధన,సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి పారామెడికల్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా శీను కల్లూరి నియమితులయ్యారు. బిఎంఎస్ యూనియన్ రాష్ట్ర నాయకులు పాపిరెడ్డి,రాము,ప్రకాష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గ సభ్యులను ప్రకటించారు.

కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న చంద్రబోస్

లాలాపేట: సియోరా గ్రూప్ సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం 2023 కేలండర్, డైరీని శుక్రవారం సినీ గేయ రచయిత చంద్రబోస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులకు, వినియోగదారులకు చంద్రబోస్ నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. గత ఆరు సంవత్సరాల నుంచి సంస్థ చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎండీ సంతోష్‌రెడ్డి, దర్శకుడు అమరేందర్, సంస్థ డైరెక్టర్లు డా. కిరణ్‌కుమార్, డా. శివారెడ్డి, సతీష్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేత అక్బర్ మృతి



అక్బర్(ఫైల్‌ఫోటో)

పద్మారావునగర్: తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ నేత అక్బర్(58) శుక్రవారం మరణించారు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు న్నారు. గత కొంత కాలంగా అస్వస్థతతో బాధపడుతున్న అక్బర్ రైల్ కళారంగ్‌లోని తన నివాసం తెల్లవారుజామున కన్నుమూశారు. అక్బర్ మరణవార్త తెలియగానే పలువురు నాయకులు రైల్ కళారంగ్‌లోని ఆయన నివాసాన్ని సందర్శించి భౌతికకాయంపై పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు.

అభివృద్ధి పనుల పరిశీలన



తాగునీటి సమస్యను ఎమ్మెల్యేకు వివరిస్తున్న స్థానికులు

కవాడిగూడ: కవాడిగూడ బండమైసమ్మ నగర్‌లో తాగునీటి పైప్‌లైన్‌ల ఆధునీకరణ తర్వాతే రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. శుక్రవారం కవాడిగూడ డివిజన్‌లోని బండమైసమ్మనగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పైప్‌లైన్ పనులు జరిగిన తర్వాతే రోడ్డు నిర్మాణ పనులు చేపడతామన్నారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు శుక్రవారం ఎమ్మెల్యే బండమైసమ్మనగర్‌లో పైప్‌లైన్ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటుకు యుద్ధ ప్రాతిపాదికన పనులు చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ సాయికృష్ణ, నాయకులు సంతోష్, రమణ, బస్తీవాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ అధ్యక్షుడిగా రమేష్‌రెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న రమేష్‌రెడ్డి, ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రతిష్టాత్మకమైన బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యపార్కు అభివృద్ధికి అంకిత భావంతో కృషి చేస్తానని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. శుక్రవారం సుందరయ్యపార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడిగా రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నిరంజన్‌రెడ్డి, కోశాధికారిగా డాక్టర్ సునీల్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా సంతోష్‌గౌడ్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత 4 ఏళ్లుగా సుందరయ్యపార్కు అభివృద్ధి కోసం సుమారు రూ.85 లక్షల దాకా ఖర్చు చేశామన్నారు. పార్కుల్లో ఓపెన్ జిమ్‌తో పాటు పార్కును అన్ని విధాలుగా ఆధునీకరించామన్నారు. హైకోర్టు న్యాయవాది పాండయ్య, హైదరాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎం. వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ యువజన నాయకులు ముఠా జైసింహా, ఎస్పీ రవీంద్ర, కె. రామానందం, నాగభూషణం, మాధవరావు, ఎస్ మురళీకృష్ణ, శ్రీనివాసాచారి, వెంకటకృష్ణారావు, మాజీ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్‌గౌడ్, కందూరి కృష్ణ, కిషన్‌రావు తదితరులున్నారు.

కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వినతి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రయాణికుల కోసం ఆర్టీసీ డ్రైవర్లు నడిరోడ్డుపై బస్సులను ఆపడం వల్ల ట్రాఫిక్ జామ్‌తోపాటు కాలుష్యానికి కారణమవుతుందని ఆరోపణలున్నాయి. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని ×ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్, అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్≤ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఆర్టీసీ డ్రైవర్లు నిర్లక్ష్యంగా బస్సులను నడిరోడ్డుపై ఆపడంతో వెనక నుంచి వచ్చే వాహనదారుల ఇంధనం వృధా కావడంతో పాటు కాలుష్యం అధికమవుతుందన్నారు. కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్ రంగయ్య, గౌరవ అధ్యక్షుడు పుప్పాల వెంకటేష్‌గుప్తా తదితరులున్నారు.



ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు వినతిపత్రం అందజేత

నేడు బీజేపీ బూత్ కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

చిలకలగూడ : సికింద్రాబాద్ నియోజకవర్గ బూత్‌కమిటీ సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు సీతాఫల్‌మండి డివిజన్ బీదలబస్తీ మైదానంలో నిర్వహించనున్నట్లు మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి తెలిపారు. ఈమేరకు శుక్రవారం రాత్రి సమావేశపు ఏర్పాట్లను పరిశీలించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదేశాల మేరకు బూత్ కమిటీ సమావేశంలో వర్చువల్ పద్ధతిలో అధినాయకత్వంతో మాట్లాడేందుకు తగిన ఏర్పాట్లు చేపట్టామన్నారు. బీజేపీ అధినాయకులు జేపీ నడ్డా, తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌గౌడ్ తదితరులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేకల సారంగపాణి, రాచమల్ల కృష్ణమూర్తి, హరి, ప్రభుగుప్తా, నాగేశ్వరరెడ్డి, భాస్కర్‌గిరి పాల్గొన్నారు.

గంగపుత్రుల సమస్యలు పరిష్కరించాలి



గంగపుత్ర సంఘం అధ్యక్షుడు ఎ.ఎల్. మల్లయ్య తదితరులు

కవాడిగూడ: చేపల వృత్తి గంగపుత్ర, బెస్త, గూండ్ల కులస్తులకు పుట్టినప్పటి నుంచి వచ్చిన హక్కు అని దీనిని విస్మరించి సొసైటీలలో ముదిరాజ్‌లకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం సరికాదని రాష్ట్ర గంగపుత్ర సంఘం అధ్యక్షుడు ఏ.ఎల్ మల్లయ్య అన్నారు. ఈనెల 26 లోపు సీఎం కేసీఆర్ గంగపుత్రులను పిలిచి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే మండల, జిల్లాస్థాయిలలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

- గణతంత్ర్య దినోత్సవం సందర్భంగా నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపి జాతీయ జెండాలను ఎగురవేస్తామన్నారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జీవో6ను రద్దు చేసి చెరువులు కుంటలపై గంగపుత్రులకే సర్వాధికారాలు కలిపించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి గంగపుత్రులను ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తుందని ఆరోపించారు.
- గీత వృత్తి గౌడ కులస్తులకు, గొర్రెల పెంపకం యాదవులు, కురుమ కులస్తులకు, చేనేతవృత్తి పద్మశాలీలకు ప్రాధాన్యతిస్తూ సొసైటీలలో సభ్యత్వం కల్పిస్తున్న ప్రభుత్వం చేపల పెంపకం, సొసైటీల విషయంలో మాత్రం గంగపుత్రులను విస్మరించి ముదిరాజ్‌లకు ప్రాధాన్యతను ఇవ్వడంపై రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు.
- రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ అసెంబ్లీలో చెరువులు కుంటలపై పూర్తి హక్కు గంగపుత్రులకే కల్పిస్తామని హామీ ఇచ్చారని ప్రస్తుతం దీనిని విస్మరించి ముదిరాజ్‌లకు ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు.
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 600 మంది ముదిరాజ్‌లు దొంగ సర్టిఫికెట్లు తీసుకుని ఉద్యోగాలలో చేరారని దీనిపై తక్షణమే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.
- వచ్చే మార్చిలోగా గంగపుత్రుల సమస్యలపై సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రభుత్వం గంగపుత్రులకు న్యాయం చేయకపోతే బీఆర్ఎస్‌లో ఉన్న గంగపుత్ర ప్రజాప్రతినిధులు తమ పదవులకు రాజీనామా చేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. గంగపుత్ర సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీహరి, కోశాధికారి మల్లేష్, కార్యదర్శులు హరిశంకర్, బాలయ్య, భగవాన్, అధ్యక్షుడు చంద్రప్రకాష్, నాయకులు పాకరమేష్, సమ్మయ్య, నరేష్, రమేష్, శ్రీనివాస్, సుమలత, మల్లేశ్వరి, రాజేశ్వరి తదితరులున్నారు.